# పత్తేదార్ దినకర్

(కథానిక)

దినకర్‌కీ వాడి అక్కయ్యకీ ఎప్పుడూ వాదనలు జరిగేవి.

డిటెక్టివ్ నవలలకి సాహిత్యంలో స్థానం లేదంటుంది అక్కయ్య.

"అవును, సాహిత్యంలో స్థానం ఎలా ఉంటుంది? అసలు ఈనాటి సాహిత్యానికి నిత్యజీవితంతో సాన్నిహిత్యం ఏముందిగనుక? ప్రేమలు అపూర్వ త్యాగాలూ కథల్లోనేగాని నేనెప్పుడూ జరిగినట్టు వినలేదు" అంటాడు వాడు.

"పట్టపగలు హత్యలూ, నడిబజార్లో రక్తపాతాలూ నేనూ వినలేదు" అనేది అక్కయ్య.

వాడికీ పనిలేదు, దానికీలేదు. కాలేజీ నుంచి రాగానే యిదే గొడవ.

"వాడు పదిమంది పిల్లల్లేరని చింత అక్కర్లేదు. వీళ్ళిద్దరే చాలు పదిమంది పెట్టు" అనేదిఅమ్మ. ఆవిడ అన్నట్టే ఒక్కరూ క్షణం ఊరుకునేవారు కారు.

"డిటెక్టివ్ నవల్సు చదివితే దొంగల్ని పట్టుకునే మార్గాలేకాక నిత్య జీవితంలో అనేక సమస్యలు సాధించవచ్చు" అనేవాడు దినకర్.

"ఓ చాలా సాధించవచ్చు. ఓ వెంట్రుక ముక్క పరీక్షించీ, ఓ పాతచెప్పులజత ఆధారం చేసుకునీ, చెప్పకుంటే సిగ్గుచేటు, ఓరోడ్డుపక్క చీకట్లో నిలబడి ఓ తూముకిందమూరి... యిలాంటివి కలల్లో జరగొచ్చుగానీ కలిలో జరిగాయంటే బుద్ధి అంటూ ఉన్నవాడు నవ్వకుండా ఉండలేడు. చాలు ఊరుకోరా."

"చాలుచాలు ఊరుకోవే" అమ్మకి ఊరుకోడం అసలు చాతకాదు.

"ఇంగ్లీషు నేర్చిన ఆడది హాలో అంటే హాలో అందిట వాడితో సరిగ్గా నువ్వుకూడా ఏమిటే తల్లీ?" అని అక్కయ్యని దెబ్బలాడేది.

"ఎందుకూ? ఏదో ఒక అవసరం రాకనూ పోదు, నేను యీమాట ఋజువు చెయ్యకుండా ఊరుకోను" అనేవాడు దినకర్.

ఇవన్నీ ఎన్నోరోజుల క్రిందటిమాటలు. డిటెక్టివ్ నవల్సుకి దినదిన సంఘటనలలో స్థానం ఉందని దినకర్ ఋజువుచేసే అవకాశం రాకుండానే అక్కయ్య కాపురానికి వెళ్ళిపోయింది. అక్కయ్య ఉండగా ఆఖరికి యింట్లో ఒక్కసారైనా దొంగ 'అన్నవాడు దూరలేదు. ఎవరికైనా డబ్బిచ్చి 'దొంగ' వేషం వేయించి ఇంట్లో ప్రవేశ పెడదామని దినకర్ ఆలోచించినా కుదరలేదు. అక్కయ్య చివరి దాకా దినకర్‌ని ఏడిపిస్తూనే అత్తారింటికి వెళ్లిపోయింది. అయినా దినకర్ డిటెక్టివ్ నవలలు చదవడం మానలేదు. తన విశ్వాసం కోల్పోనూలేదు. అయితేదాన్ని ఋజువు చేసే అవకాశం మాత్రం వస్తుందని అతను కలలో కూడా అనుకోలేదు.

* * *

తుని స్టేషనుకి అక్కయ్య, బావా వచ్చారు. బావే అన్నాడు.

"ఏమోయ్ పెళ్ళి కొడుకా? ఆఖరికి ఎలా అయితేనేం బయలుదేరవే?"

దినకర్ ఏం మాట్లాడలేదు, దిక్కులుచూస్తూ ఊరుకున్నాడు.

"మేమందరం నీలా ఒద్దున్నవాళ్ళమే, మళ్ళా ఏడాది తిరక్కుండా. పిల్లల్ని కన్నాం—తప్పుతుందా?" అన్నాడు బావ. గజపతి నగరంలో ఎవరో తెలిసినవాళ్ళ పిల్ల ఉందిట. అమ్మ చూసి రమ్మని ఎంతో బలవంతంమీద పంపించింది.

"ఏమిటో యిప్పట్లో చేసుకోవాలనిలేదు బావా!" అన్నాడు దినకర్.

"మొదట్లో అలాగే ఉంటుందిమరి. ఇక అట్టే టైములేదు. ఎక్కు పద్మా." అక్కయ్య రైలు ఎక్కింది. స్థలంచూసుకుని కూర్చున్నాక అంది.

"కామాక్షమ్మగారితో చెప్పేను. రేపు వాళ్లింట్లో భోంచెయ్యండి. మరేం మొహమాటపడకండి. వాళ్ళమ్మాయి సుబ్బమ్మకి మన పాపిగాడంటే తగని ముద్దు. వాడు అట్టే ఏడుస్తే ఆ అమ్మాయికి యిచ్చెయ్యండి. రేపు పాలవాడొస్తే పావుశేరు పుచ్చుకోండిచాలు. వీడు మొహమాటపడుతాడని మా అమ్మ మరీమరీ రాసింది కాబట్టి

అవసరాల రామకృష్ణారావు

వెళ్ళక తప్పలేదు. మరివస్తానూ, తలుపులూ అవీ జాగ్రత్తగా వేసుకుంటారుగదూ?"

అక్కయ్య ఇన్ని చెప్పడం దినకర్‌కి ఆశ్చర్యమేసింది. మొన్న మొన్నటిదాకా తనతో ఆడతూ పాడుతూన్న అక్కయ్య ఎంతలో ఎన్ని బాధ్యతలు నేర్చుకుంది? రేపొద్దుట తనూ అంతేనా? "మరదల్ని సెటిల్ చేసుకుని మరీరావాలిసుమా!"

బావ మాట్లాడుతూనే దూరమై చీకట్లోకలిసిపోయాడు. ప్యాసెంజరు చీకటిని దూసుకుంటూ ప్రయాణం సాగించింది.

* * *

గజపతినగరంలో దిగగానే దినకర్ వాచీమాసుకున్నాడు, చీకట్లో రేడియంముల్లు రెండున్నర చూపిస్తున్నాయి. చుట్టూచూడగానే డిటెక్టివ్ నవల్సు చదివిన దినకర్ గుండెలు భయంతో కొట్టుకున్నాయి. స్టేషనులో ఒకమూల గుడ్డి లాంతరుతప్ప తక్కినదంతా కటికచీకటి. ఆ స్టేషనులో వాళ్ళిద్దరూతప్ప ఎవరూ దిగలేదు. ఒకరిద్దరు అక్కడ ఎక్కారేమో, అంతే. స్టేషనులో ఒకరిద్దరు అక్కడక్కడపడుకుని నిద్రపోతున్నారు. స్టేషనుమాష్టరురూంలో మడతమంచంమీద ఎవరో పడుకుని నిద్రపోతున్నారు. మనిషీమనిషీ కనపడని ఆ చీకటి నిశరాత్రిలో మేలుకున్నవారు వాళ్ళిద్దరే.

అక్కయ్యవైపుచూశాడు దినకర్. దాని ఒంటి నిండా మొయ్యలేనన్ని నగలున్నాయి. అసలు వాళ్ళమ్మే బోలెడునగలు పెట్టింది, పైగా అత్తారు ఇంకా నగలు పెట్టేరు. అన్నీ పెట్టుకుని అక్కయ్య వచ్చేసింది.

"ఈ ఆడాళ్ళకి మతీసుతీ ఉండదు. పిలవ భయం "పెళ్ళాడే బొమ్మ"లా నగలెట్టుకు చక్కా వస్తారు. పిల్లని చూసుకునేది నేనుగదా నీకన్ని నగలెందుకే అక్కా?" అక్కయ్య వేళాకోళాలకి కాలమంటూ లేదు. "నిజమే సుమా తమ్ముడూ, నా కామాట తట్టనేలేదు. పిల్లని చూసుకునేది నువ్వుగదూ అన్నట్టు! ఇంద యీ నగలన్నీ పెట్టుకో." అక్కయ్య నవ్వు దినకర్‌కి ఒళ్ళు మండించింది. అలా అందిగాని అక్కయ్యకి మాత్రం ఆ చీకటి రాత్రి చూస్తే భయమెయ్యలేదనా?

"ఊళ్ళోకెళ్ళే ప్రయత్నమేమైనా ఉందా యిక్కడ నిలబడిపోడమేనా?" అక్కయ్య మాటలు దినకర్ సరిగ్గా విననేలేదు. వాడు మరో సంగతి ఆలోచిస్తున్నాడు. కాలేజీ శలవు కలిసిరాక దిక్కుమాలినది యింతరాత్రి తను బయలుదేరేడు. అయినా మాయదారి రైలు యింతలేటు అవుతుందని ఎవరనుకున్నారు? ఈ పాడుఊరు ఇంత పల్లెటూరు అని ఎవరనుకున్నారు? అమ్మ, కరణంగారు తమకి దూరం చుట్టమనీ వాళ్ళింట్లో దిగమనీ చెప్పింది. ఈ చీకటి సముద్రంలో ఆ దీవిని చేరుకోడ మెలాగ? దీనికితోడు ఒంటెడు నగలూ అదీ, యీ అక్కయ్య ఒక రై! తను ఒక్కడూ అయితే యీ రాత్రికి ఏ స్టేషన్ మాష్టరు రూములోనో పడుకుని పొద్దుట లేచి హాయిగా ఊళ్ళోకి వెళ్ళేవాడు. ఇప్పుడు యీ అక్కయ్యతో ఎలాగ భగవంతుడా? వాడుకూడా సన్నంగా పొడుగ్గా ఉంటాడుగాని ఏమంత బలవంతుడని? అక్కయ్య అసలేఅర్భకురాలు. ఇద్దర్నీ తన్నడానికిఒకడు చాలు!

"చస్తూంటే సంధి మంత్రమని" మధ్యని దీని అల్లరేమిటి?

"ఏదో చేదాంగాని ముందు నీ నగలుతీసి యిలా యిచ్చేయ్."

"అదేమిట్రా శుభమా అని?"

"మంచి శుభఘడియలే యివి. తరువాత ఏ దొంగాడికోయిచ్చేకన్న ముందు నా చేతికి యియ్యడం మంచిది."

నగలన్నీ తీసి అక్కయ్య యిచ్చేసింది. తన రిస్టు వాచీ, చేతి ఉంగరంకూడా దినకర్ తీసేశాడు. ఇన్నీ కలిసి చేతిసంచీలో పడేశాడు.

"బాగుందిరాఅన్నీ తీసేస్తే ఏంబాగుంటుందీ?"

"ఇంటికెళ్ళి అన్నీ పెట్టుకుందుగాని లేవే, ముందు యిచ్చెయ్యవే."

దూరంనుంచి ఏదోదీపం వారివైపు రావడం దినకర్‌కి భయమేసింది. అక్కయ్య త్వరత్వరగా నగలు తీసేసింది. ఆ వచ్చినవాడు చాలా బలిష్ఠుడు. దండలో కండలుతిరిగిఉన్నాయి. మీసాలు బాగా పెరిగి వంకీలుతిరిగిఉన్నాయి. ఓ చేతిలో కొరడా. ఓ చేతిలో లాంతరు.

"బండికావాలా బాబూ?" దినకర్‌కి నోట మాట వెంటనే రాలేదు

"కరణంగారిల్లు ఎరుగుదువటోయ్?" అక్కయ్య అడిగింది.

"ఎరుగుదును, రండి తల్లీ అవతల బండీవుంది" అక్కయ్య, దినకర్ బండిలో కూర్చున్నారు. రెండెడ్లబండీ మువ్వలచప్పుడుతో బయలుదేరింది, పావుగంట అతికష్టంగా గడిచింది.

"కరణంగారిల్లు దూరమేమిటోయ్?" అక్కయ్య అడిగింది.

"ఊరికి దగ్గిరే."

"ఊరు దూరమా?"

"మరేతల్లీ, నాలుగుకోసులు."

దినకర్ గుండెల్లో రాయిపడింది. నాలుగు కోసులే? దారిలో ఏక్షణానబండిఆపి బండీవాడు దిగమంటాడో! అసలుబండీ ఏదారిన వెళుతుందో?

బండి ఆగిపోయింది. దినకర్, అక్కయ్యా ఒకరొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

"కొరడాపడిపోయిందిబాబూ...ఎ ఎ హే పప్పప్పప్పా..."


బండికదిలింది. దినకర్ గుండె తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది. దారిపొడుగునా చింతచెట్లు భూతాల్లా, జీమూతాల్లా కనిపిస్తున్నాయి. వీడు ఏ క్షణాన దిగమంటే ఎవరుదిక్కు? 'దిక్కెవ్వరు దినకరునకు' తను చదివిన డిటెక్టివ్ నవల్సుకు దైనిక సంఘటనలో ఉన్న స్థానం యిదేనా? చదువుతూంటే చిరుచెమటలుపోసే తన నవల్సు యిలాంటి క్లిష్టపరిస్థితుల్లో 'గజేంద్రమోక్షం'లో పద్యాలు జ్ఞాపకం తేవలసిందేనా? కేవలం భుజబలమేగల యీ బండి నాయుడు ముందు అపరాధ పరిశోధక గ్రంథాలు తనకిచ్చిన బుద్ధి బలమంతా తీసికట్టేనా? కిల్లేదు, ఎంతమాత్రంవీల్లేదు. దినకర్‌కి చక్కని ఆలోచన తట్టింది. ఇంతట్లో బండివాడు అడిగాడు,

"ఏ ఊరు బాబూ మనది?"

"ఏ ఊరు అయితే ఏంలాభం నాయుడూ రోజులు బాగుండనప్పుడు!"

"అదేం బాబూ!"

"ఏమని చెప్పను? నువ్వు యీవాళ యీ రూపాయ సంపాదించావంటే కలోగంజో త్రాగి సంతృప్తిగా పడుకుంటావు—మాకు ఆ నమ్మకమూ లేదుగదా!"



ఐక్యరాజ్యసమితి ఇండియా డెలిగేషన్‌కి సలహాదారుగా వెళ్లిన శ్రీ. పి. కొండపిగారికి (కూర్చున్నవారిలో ఎడమనుండి ఆఖరువారు) సమితి ఆంధ్ర ఉద్యోగులు యీ నెలలో ఆతిథ్యం యిచ్చిన సందర్భంలో తీసిన ఫోటో.

"ఆదేటి బాబూ, మారాజులు మీకేంటి?"

"గొప్ప మారాజులమే! ఈ రోజుల్లో మీరే నయమనుకో! చిన్నప్పుడు చదువబ్బక చెడు తిరుగుళ్లు తిరిగినందుకు ఎంతైనా అనుభవిస్తున్నాను." అక్కయ్య యిదేమిటా అని ఆశ్చర్యంగా వింటోంది.

"ఇప్పుడు యీ సిల్కు సూటు అద్దెకు తేడానికి నాలుగురోజులు పట్టింది. తీర్చలేనివాడికి అప్పెవడిస్తాడు? ఇప్పుడు యిది ఉందా, మా అక్క పద్మ, దాని మెళ్ళోకి ఓనగ చేయిద్దామని నాలుగు సంవత్సరాలబట్టి మాఅమ్మ ప్రయత్నిస్తోంది. పూటకి గతిలేనివాళ్ళకి నగలొకటా? చచ్చీ చెడీ పెళ్ళిచేస్తే, దీనిమొగుడు దీన్నిరోజూ చచ్చేలా కొడతాడు. ఇలా ఏరోజు కారోజు గడవక ఏడుస్తూంటే మాఅమ్మ పెళ్ళి సంబంధం చూసుకురమ్మని మమ్మల్ని పంపింది. నా పొట్ట నేనే పోషించుకోలేక ఏడుస్తూంటే నాకు పెళ్లాం, పిల్లలు ఎందుకు చెప్పు? ఈ బ్రాహ్మలికి బుద్ధి లేదోయ్ నాయుడూ!"

తెలివయిన అక్కయ్య అసలుసంగతి అర్థంచేసుకోడానికి అట్టేసేపు పట్టలేదు. తమ బీదవాళ్ళమని చెప్పకుంటే "కన్నమేస్తే మంగలం దొరికిందని" తమనెందుకు ఆపి ఆటకాయిస్తాడు?

"ఈసూటు విడిస్తే మారుబట్ట లేదోయ్. పాతబట్టలుసంచీలోవేసుకువచ్చాం" మరో అరగంటలో బండి ఊరు చేరింది. దినకర్ అక్కయ్యవైపు తిరిగి సగర్వంగా "చూశావుటే అక్కా! ఎలా గమ్మత్తుచేసి ఎంత తమాషాగా తప్పించుకొచ్చానో? ఈ తెలివితేటలు నాకు ఎక్కడ్నుంచి వచ్చాయంటావు? ఇప్పుడే నా డిటెక్టివు నవల్సు విలువ అర్థమయిందా?" అన్నాడు మెల్లగా. అక్కయ్య "ఇలాంటివి చాలా చూశాంలే" అన్నట్లు మూతి విరిచింది. బండి కరణంగారిల్లు చేరింది.

కరణంగారి ప్రక్కయింటి ముందు వాకిలిలో ఓ అమ్మాయి సంక్రాంతి ముగ్గు పెడుతోంది. ఎవరో వచ్చారని తలెత్తి చూసింది. ఒక్కసారి దినకర్‌నీ పద్మనీ చూసి యింట్లోకి పరిగెత్తింది. దినకర్ ఆ అమ్మాయిని ఒక్కసారి చూశాడు. విరిసీ విరియని లేతసూర్య కిరణాలలో తెలిసీ తెలియని చూపుచూసిన ఆ అందాల భరిణె విడిచీవిడియని మొగ్గలా దినకర్‌కి కనపడింది. ఆ అమ్మాయే తనకివ్వనున్న పిల్ల అని తెలిసిన తరువాత దినకర్ పొందిన ఆనందం యింతాఅంతా కాదు. పోలీసు స్పిరిటుఉన్న పిల్లనికాని తానుచేసుకోనని నిర్ణయించుకున్నట్లు దినకర్‌కి ఆ క్షణం జ్ఞాపకం రానేలేదు. ఇంక వేరేపిల్లని చూడక్కర్లేదనీ, ఒప్పుకున్నట్లే అనీ దినకర్ కరణంగారికి తెలియబరచి అక్కయ్యతో వెంటనే ప్రయాణమైనాడు. అమ్మ ఎంత సంతోషించిందో చెప్పలేం. అయితే యీ సంతోషము అట్టే రోజులు నిలబడలేదు. వేరే, పిల్లవాడ్ని చూడక్కరలేదనీ, వారికిష్టంలేదనీ పెళ్లికూతురి తరఫువారు కరణంగారి ద్వారా కబురు పంపడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఆవాళ వీళ్ళకి బండికట్టినవాడు పెళ్ళికూతురి తండ్రిఇంట్లో నమ్మకమయిన పాలికాపు అని తేలింది.

"చూసిచూసి బట్టలు బడితెలలో పుచ్చుకునేవాడికి పిల్లనిచ్చి ఎలా గొంతుక కొయ్యగలమమ్మా?" అందిట కావలసిన వియ్యపురాలు! కరణంగారు ఎంతచెప్పినా ఎవరూ వినిపించుకోలేదుట.

"అదేమిటమ్మా వాళ్ళకి యిరవై ఎకరాల మాగాణీ ఉంటేనూ?" అన్నాట్ట.

"చాల్లేవయ్యా, ఏగాణీ లేనివాడికి మాగాణీ ఒకటే తక్కువొచ్చింది" అని కొట్టిపారేశారుట. "చెప్పకుంటే సిగ్గుచేటు! నాయుడుతో కష్టం సుఖం చెప్పుకున్నారుట మొన్న" అమ్మలక్కలందరూ పెదవులు విరిచారు.

"నా కంఠంలో ప్రాణముండగా బుల్లెమ్మాయిగార్ని ఆ గోచీపాతరాయుడి చేతిలో పెట్టనియ్యను" అన్నాట్ట నాయుడు.

"ఎవరిమాటో ఎందుకు? నా కళ్ళతో నేను చూస్తేనే! ఆ కూడావచ్చినావిడ మెళ్లో పుస్తెల తాడు తప్పిస్తే చేతికో బంగారం గాజయినా లేదు!"

అని మూతి విరిచిందట ఆయిల్లాలి కూతురు, పెళ్లికూతురు.

ఇదంతా అక్కయ్యా బావా చెప్పుకొని నవ్వుకోనిరోజులేదు. సాంఘిక ప్రయోజనంమాట దేముడెరుగు, ఆ తరవాత దినకర్ డిటెక్టివ్ నవల ముట్టుకొన్నట్టయినా సాక్ష్యంలేదు!